సాక్షి
ఒడిశా

గురువారం । 31 । అక్టోబర్ । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 3,28,443

వెండి : 8 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



రాష్ట్రపతి భవన్‌లో 'కోణార్క్'

కోణార్క్ చక్రాలతో రాష్ట్రపతి భవనం కొత్త శోభను సంతరించుకుంది. ప్రెసిడెంట్ ద్రౌపది ముర్ము చొరవతో నాలుగు కోణార్క్ చక్రాల శిల్పాల్ని ఏర్పాటు చేశారు.

-8లో

ఆటబొమ్మలో నాగుపాము



నాగుపాము కలకలం సృష్టించింది. ఆటబొమ్మలో చిక్కుకోవడంతో అధికారుల, ప్రత్యేక వైద్య బృందం ప్రత్యేక దృష్టి సారించి పామును బయటకు తీశారు.

-8లో

న్యూస్‌రీల్

దానా తుఫాన్ బాధితులకు విరాళం



సబ్ కలెక్టర్‌కు చెక్ అందిస్తున్న అమర్‌కుమార్ సాహు

జయపురం: రాష్ట్రంలో ఇటీవల సంభవించిన దానా తుఫాన్‌తో సర్వస్వం కోల్పోయిన బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకొస్తున్నారు. బుధవారం జయపురం పట్టణానికి చెందిన వ్యాపారి అమరకుమార్ సాహు ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్‌కు రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఈ మేరకు జయపురం సబ్ కలెక్టర్ ఎ.శౌశ్య రెడ్డికి చెక్ అందజేశారు.

చోరీ సొత్తు స్వాధీనం



బాధితులకు నగదు అందిస్తున్న పోలీసులు

రాయగడ: రెండు దోపిడీ కేసులకు సంబంధించి నిందితులను అరెస్టు చేసి వారి నుంచి స్వాధీనం చేసుకున్న సొత్తును బాధిత కుటుంబాలకు బుధవారం అప్పగించారు. ఈ నెల 21న టికిరిలొని బంకాంబ పంచాయతీ ఉపారొకొడింగ గ్రామానికి చెందిన రామ సాహు అనే వ్యక్తి ఇంటి పైకప్పు విరగ్గొట్టి లోపలికి చొరబడిన నిందితులు రూ.20 వేలు నగదు, బంగారు ఆభరణాలు దోచుకుపోయారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులు పట్టుకుని దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌డీపీఓ రస్మీరంజన్ సేనాపతి, టికిరి ఐఐసీ విశ్వచందన్ బాగ్ సమక్షంలో బాధిత కుటుంబీకులైన రామసాము, నిరుపమ సాహులకు నగదు అప్పగించారు.

ప్రభుత్వ స్థలంలో ఆక్రమణ తొలగింపు



దాబాను తొలగించి హెచ్చరిక బోర్డును అమర్చిన దృశ్యం

రాయగడ: జిల్లాలోని బిసంకటక్ సమితి చంచారగుడ పెట్రోల్ బంక్ సమీపంలో ప్రభుత్వ స్థలంలో ఉన్న దాబాను అధికారులు తొలగించారు. గతంలో ఈ స్థలాన్ని ఖాళీ చేయాలని అధికారులు నోటీసులు జారీ చేసినా నిర్వాహకులు పట్టించుకోలేదు. దీంతో బుధవారం అధికారులు పోలీస్ బందోబస్తు నడుమ బుల్డోజర్‌తో దాబాను తొలగించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

తేనెటీగల దాడిలో 40 మందికి గాయాలు



చికిత్స పొందుతున్న బాధితుడు

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ శ్మశానవాటికకు వచ్చిన వారిపై తేనెటీగలు దాడి చేయడంతో 40 మందికిపైగా గాయపడ్డారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. బుధవారం ఉదయం బొయిపరిగుడ సమితి వార్డు మెంబర్ లక్ష్మీ మరియు తండ్రి మరణించడంతో ఆయనకు అంత్యక్రియలు జరిపేందుకు శ్మశానానికి తీసుకెళ్లారు. వారి వెంట సుమారు రెండు వందలకుపైగా బంధువులు, మిత్రులు ఉన్నారు. మృతదేహాన్ని దహన సంస్కారాలు చేస్తున్న సమయంలో పొగ ఆ ప్రాంతం అంతా వ్యాపించింది. దీంతో సమీపంలో ఉన్న ఒక చెట్టుకు ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా బయటకు వచ్చి శ్మశానంలో ఉన్నవారిపై దాడి జరిపాయి. ఈ ప్రమాదంలో గాయపడిన వానిరిని బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రిలో చేర్చారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది.



బతుకు పూలబాట

- బంతిపూల సాగులో మెప్పిస్తున్న యువకుడు
- ఇంజినీరింగ్ చదివినా సేద్యంపై మక్కువతో పొలంలోకి..
- ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

రాయగడ: మట్టిని నమ్ముకున్నవాడు ఎప్పుడూ నష్టపోడు అన్న నానుడిని నిజం చేస్తూ ఓ యువ రైతు లాభాల పంట పండిస్తున్నాడు. ఇంజినీరింగ్ విద్య పూర్తి చేసినా వ్యవసాయంపై ఉన్న మక్కువతో భూమితల్లిని నమ్ముకుని సాగులోకి దిగి అద్భుతాలు సృష్టిస్తున్నాడు. వ్యవసాయం పూలబాట కాదని కొందరు నిరుత్సాహపరిచినా వెనుకడుగు వేయకుండా సేద్యంలో సిరులు పండిస్తున్నాడు. సెంటు భూమి కూడా లేని నువ్వు ఏం వ్యవసాయం చేస్తావన్న వారి నోళ్లు మూయించి కాసులు సంపాదిస్తూ పది మందికీ స్ఫూర్తిగా నిలుస్తున్నాడు. అతనే యువ రైతు కె.రామ్‌చరణ్.

రాజమండ్రి టు రాయగడ..

రాయగడ పట్టణానికి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలోని సాయిప్రియ నగర్ ప్రాంతంలో ఎకరా విస్తీర్ణంలో బంతి సాగు చేస్తున్న యువ రైతు కె.రామ్‌చరణ్. ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి ప్రాంతానికి చెందిన రామ్‌చరణ్ రెండేళ్ల క్రితం బీటెక్ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేశాడు. ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నప్పటికీ వ్యవసాయంపై మక్కువ, తండ్రి రైతు కావడంతో ఆ దిశగా అడుగులు వేశాడు. తండ్రి వద్ద మెలకువలు నేర్చుకుని వ్యవసాయంపై పట్టు సాధించాడు. గత ఏడాది 15 ఎకరాల భూమిని లీజుకు తీసుకుని వంగ, టొమాటో, క్యాబేజీ వంటి పంటలను సాగు చేశాడు. ఛత్తీస్‌గఢ్ నుంచి తీసుకొచ్చిన హైబ్రిడ్ రకం బంతి నారును ఎకరా విస్తీర్ణంలో నాటాడు. సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తూ డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రాధాన్యం కల్పించడంతో మంచి దిగుబడులు సాధిస్తున్నాడు. ఏడాదిలోమూడు సార్లు పంట చేతికి అందడంతో మంచి లాభాలు వస్తున్నాయని రామ్‌చరణ్ చెబుతున్నారు.



పూలను సేకరిస్తున్న మహిళలు



సేకరించిన పూలను తీసుకువస్తున్న దృశ్యం



విక్రయించేందుకు సిద్ధం చేస్తూ..

ఆనందంగా ఉంది..



వ్యవసాయం అంటే మక్కువ. ప్రతిరోజూ 70 నుంచి 80 కిలోల బంతి పూలు కోస్తుంటాం. 15 మంది ఆదివాసీ మహిళలకు పని కల్పిస్తున్నాం. రాయగడలో బంతిపూలకు గిరాకీ ఉంచడంతో మంచి లాభాలు వస్తున్నాయి. బరంపురం, పర్లాకిమిడి, భువనేశ్వర్ వంటి ప్రాంతాలతో పాటు ఆంధ్రదేశ్‌లోని విశాఖపట్నం వంటి దూరప్రాంతాలకు సైతం బంతిపూలను ఎగుమతి చేస్తున్నాం.

– కె.రామ్‌చరణ్, యువ రైతు

గుణుపురం మాజీ ఎమ్మెల్యేకు జీవిత ఖైదు ఖరారు

భువనేశ్వర్: గుణుపురం మాజీ ఎమ్మెల్యే రామ మూర్తి గొమాంగోకు వ్యతిరేకంగా దిగువ న్యాయ స్థానం జారీ చేసిన తీర్పుకు రాష్ట్ర హైకోర్టు పట్టం గట్టింది. భార్య హత్య కేసులో దిగువ న్యాయ స్థానం ఆయనకు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ఈ తీర్పుని సవాల్ చేసిన మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానాన్ని ఆశ్రయించారు. ఈ కేసు విచారణ పురస్కరించుకుని రాష్ట్ర హై కోర్టు పూర్వాపరాలు పరిశీలించిన మేరకు లోగడ దిగువ న్యాయ స్థానం జారీ చేసిన తీర్పుని ఖరారు చేస్తు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది.

కేసు వివరాలు ఇలా..

1995 సంవత్సరంలో మాజీ ఎమ్మెల్యే భార్య శశి రేఖ అనుమానాస్పదంగా మృతి చెందారు. ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు భర్త స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా ప్రాథమిక దశలో అసహజ మరణంగా కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. 1995 ఆగస్టు 29న స్థానిక ఖారవేళ నగర్ ఎమ్మెల్యే కాలనీ క్వార్టరు బాత్రూమ్‌లో శశి రేఖ పాక్షిక దగ్ధ శరీరం గుర్తించారు. అప్పటికి ఆమె గర్భిణిగా ధృవీకరించారు. ఈ ఆధారాలతో లోతుగా చేపట్టిన దర్యాప్తులో ముందస్తు వ్యూహాత్మక హత్యగా పోలీసుల విచారణలో తేలింది. ఈ నివేదిక ఆధారంగా నర బలి, హత్య ఆరోపణతో ఐపీసీ 302 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. తదుపరి దశలో సాక్ష్యాల గల్లంతు ఆరోపణతో ఐపీసీ 201 సెక్షన్ కింద కేసు నమోదైంది. ఈ కేసుల విచారణలో న్యాయ స్థానం 11 మంది సాక్షుల్ని ప్రశ్నించి 15 బలమైన పత్రాల్ని పరిశీలించింది. ఈ పరిశీలన ఆధారంగా ఆరోపణలు రుజువు కావడంతో నిందిత మాజీ ఎమ్మెల్యే రామ మూర్తి గొమాంగోకు స్థానిక ఎమ్మెల్యేకి కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. రామ మూర్తి గొమాంగో జనతా దళ్, బిజూ జనతా దళ్, భారతీయ జనతా పార్టీల తరుపున ఎమ్మెల్యేగా గెలిపొందారు.

జగన్నాథ్ సాగర్ పునరుద్ధరించాలి



పట్టణ ప్రధాన కూడలిలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ట్రస్టు సభ్యులు



సేవ్ జగన్నాథ్ సాగర్ రథం

జయపురం: పట్టణంలోని చరిత్రాత్మక జగన్నాథ్ సాగర్ పునరుద్ధరించాలని జయపురం మో జగన్నాథ్ సాగర్ ట్రస్టు డిమాండ్ చేసింది. ట్రస్టు ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌ను ఉద్దేశించిన వినతిపత్రాన్ని జయపురం సబ్ కలెక్టర్ అక్కవరం శౌశ్య రెడ్డికి మంగళవారం సమర్పించారు. జగన్నాథ్ సాగర్ అభివృద్ధి, పునరుద్ధరణకు చేపడుతున్న పనులు హాస్యాస్పదంగా ఉన్నాయని నిందించారు. జగన్నాథ సగర్ పురుద్ధరణకు వినతిపత్రంలో ట్రస్టు కొన్ని సూచనలు చేసింది. పునరుద్ధరణ పేరుతో చేపట్టిన సుందరీకరణ పనులు ముందుగా నిలుపు చేయాలని విజ్ఞప్తి చేసింది. వివిధ విభాగాల ఆధీనంలో ఉన్న జగన్నాథ్ సాగర్‌ను ఒకే విభాగం పరిధిలోకి తీసుకురావాలన్నారు. ముందుగా సాగర్ సరిహద్దులను కొలతల ద్వారా గుర్తించి ఎన్ని ఎకరాలు ఉన్నది వెల్లడించాలని కోరారు. జగన్నాథ్ సాగర్‌లో కలుస్తున్న అన్ని డ్రైనేజీలు బంద్ చేయాలని డిమాండ్ చేశారు. సాగర్ పరిధిలోని మత్స్య విభాగ కార్యాలయాన్ని మరో ప్రాంతానికి తరలించాలని కోరారు. జగన్నాథ్ సాగర్‌ను కేంద్ర ప్రభుత్వ అమృత సరోవర పథకంలో చేర్చాలని, ఇంతవరకు సాగర్ అభివృద్ధికి చేసిన ఖర్చుపై దర్యాప్తు జరపాలని విన్నవించారు. అనంతరం జయపురం ప్రజానీకాన్ని జగన్నాథ్ సాగర్‌పై అవగాహన కల్పించేందుకు 'సేవ్ జగన్నాథ్ సాగర్' రథాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు రజనీ కాంత నాయిక్, కార్యదర్శి నిరంజన్ పాణిగ్రహి, బి.చంద్ర శేఖర్, రంజన్ పాణిగ్రాహి, రఘు త్రిపాఠీ, లలిత అగర్వాల్, లున పాణిగ్రహి తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి శీతాకాల సమావేశాలు

భువనేశ్వర్: రాష్ట్ర శాసన సభ శీతాకాల సమావేశాలు నవంబర్ 26 నుంచి ఆరంభమై డిసెంబర్ నెల 31వ తేదీ వరకు కొనసాగుతాయి. మోహన్ చరణ్ మాఝి సర్కారు అధికారం చేపట్టిన తరువాత ఇవే తొలి శీతాకాల సమావేశాలు. 30 రోజులు సమావేశాలు నిర్వహించనున్నారు. వీటిలో 25 అధికారిక పని దినాలు, మిగిలిన 5 ప్రైవేట్ సభ్యుల పని దినాలుగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ 5 దినాలు బిల్లులు, తీర్మానాల వ్యవహారాలు కొనసాగుతాయి. ఈ సమావేశాల్లో 2024– 25 ఆర్థిక సంవత్సరం తొలి అనబంధ వ్యయ ప్రణాళిక చిట్టా ప్రవేశ పెడతారు. ఆర్థిక శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఈ ప్రతిపాదనల్ని సభలో ప్రవేశ పెట్టనున్నారు. డిసెంబర్ నెల 5న ఈ ప్రతిపాదనలను ప్రవేశ పెట్టేందుకు కార్యక్రమం ఖరారైంది. నవంబరులో 5 రోజులు, డిసెంబర్‌లో 25 రోజులు సమావేశాలు ఉంటాయి. క్రిస్మస్ పురస్కరించుకుని డిసెంబర్ 25న సమావేశాలకు సెలవు ప్రకటించారు.

అవినీతి కేసులో.. ఏడుగురు ఉద్యోగులకు జైలు శిక్ష

పర్లాకిమిడి: గజపతి జిల్లా ఉద్యానవన శాఖలో 1988లో విజిలెన్సు శాఖకు పట్టుబడిన ఏడుగురు ప్రభుత్వ ఉద్యోగులకు ఒక ఏడాది జైలు శిక్ష, పదివేల రూపాయలు జరిమానా విధిస్తూ బరంపురం విజిలెన్సు స్పెషల్ జడ్జి బుధవారం తీర్పు నిచ్చారు. గజపతి జిల్లా ఉద్యానవన శాఖలో ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించకుండా స్వాహా చేసిన కేసులో విజిలెన్సు అధికారులకు పట్టుబడ్డారు. జగన్నాథ సామంత (విశ్రాంత ఉద్యానవన శాఖ అధికారి), మాజీ ఫీల్డు టెక్నీషియను రంకానిధి డకువా (పర్లాకిమిడి), ఉద్యానవనశాఖ మాజీ ఫీల్డు టెక్నీషియన్ శబర ప్రధాన్, ప్రతాప్ చంద్ర పట్నాయక్ (మాజీ గ్రాఫ్టర్), పర్లాకిమిడి, సనాతన గోమాంగో గ్రాఫ్టర్ (కాశీనగర్), మాజీ గ్రాఫ్టర్ పురుషోత్తమ బెహేరా (గుమ్మా బ్లాక్), వనమాలి హోరి హోర నాయక్ (నువాగడ బ్లాక్)లపై చార్జిషీటు 1988 409/467/468/477/ 341 సి.ఆర్.పి.సి కింద నిందితులుగా విజిలెన్సు జడ్జి, బరంపురం నిర్ధారిస్తూ తీర్పు చెప్పారు. పై ఏడుగురు ఉద్యోగుల నెలవారీ పింఛన్లను కూడా నిలిపి వేయాలని విజిలెన్సు అధికారులు (బరంపురం) సంబంధిత శాఖలకు ఆర్డీలు పెట్టారు.

కాలుష్య రహిత దీపావళిని జరుపుకొందాం



ర్యాలీ నిర్వహిస్తున్న శ్రీకృష్ణచంద్రగజపతి కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు



ర్యాలీ చేస్తున్న మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు



మార్కెట్ జంక్షన్ వద్ద పరిశుభ్రం చేస్తున్న మహిళా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థినులు

పర్లాకిమిడి: కాలుష్య రహిత దీపావళిని జరుపుకుందానమని విద్యార్థులు నినదించారు. స్థానిక శ్రీకృష్ణచంద్ర గజపతి కళాశాల ఎన్‌ఎన్‌ఎస్ విద్యార్థులు దీపావళి సందర్భంగా మై భారత్..మై దీపావళి పేరుతో చైతన్య కార్యక్రమాన్ని బుధవారం పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్‌వీధి, రాజవీధి ప్రాంతాల్లో ర్యాలీ చేశారు. దీపావళి రోజున టపాసులు కాల్చి చెత్తను తగులబెట్టడం వలన పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. అలాగే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థినులు కూడా ర్యాలీ చేశారు. డోలా ట్యాంకు నుంచి పోలీసు స్టేషన్, మార్కెట్, రాజవీధి మీదుగా ర్యాలీ చేసి పర్యావరణాన్ని కాపాడుదామని ప్రజలకు పిలుపు నిచ్చారు. అలాగే మార్కెట్ జంక్షన్ వద్ద పరిశుభ్రం చేశారు. ర్యాలీలో ఎస్.కె.సి.జి.కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ లీడరు ప్రొఫెసర్ బిద్యాధర్ శెఠి, మహిళా కళాశాల ప్రిన్సిపల్ రీనాసాహు, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

అత్రి పాసింజర్ హాల్టు ప్రారంభం



ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, రైల్వే అధికారులు

భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే జోన్ పరిధిలోని ఖుర్దారోడ్ మండలంలో రైల్వేస్టేషన్ల అభివృద్ధి పథం శరవేగంగా సాగుతోంది. ఖుర్దారోడ్ – బొలంగీరు రైలు మార్గం ప్రాజెక్టు పనుల్ని ఉభయ దిశల్లో నిర్వహిస్తుండగా.. తాజాగా అట్రి పాసింజర్ హాల్టు స్టేషన్‌ను బుధవారం ప్రారంభించారు. రూ. 58 లక్షలు వెచ్చించి ఈ ప్లాట్‌ఫారమ్ నిర్మాణం పూర్తి చేశారు. ఖుర్దారోడ్ – దసపల్లా దిశలో ఇది రెండో ప్రయాణికుల హాల్టు స్టేషను కావడం విశేషం. గతంలో బొలగాడా పాసింజర్ హాల్టు స్టేషనును ప్రారంభించారు. మరో రెండు స్టేషన్ల నిర్మాణం దాదాపు తుది దశకు చేరుకుంది. ఈ జాబితాలో సన్నాపాదారొ, తొరాబొయి స్టేషన్లు ఉన్నాయి. త్వరలో వీటిని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు మండల రైల్వే అధికారులు చెబుతున్నారు. కార్యక్రమంలో స్థానిక పార్లమెంటు సభ్యురాలు అపరాజిత షడంగి, ఎమ్మెల్యేలు ప్రదీప్ కుమార్ సాహు (బెగుణియా), ప్రశాంత కుమార్ జగదేవ్ (ఖుర్దా), ఖుర్దారోడ్ మండల రైల్వే అధికారి డీఆర్‌ఎం హెచ్.ఎస్.బాజ్వా పాల్గొన్నారు.

అవినీతిపై పోరాటం చేయాలి



మాట్లాడుతున్న ఎన్‌ఎస్‌ఎస్ అధికారిని మధుస్మితా ప్రధాన్

పర్లాకిమిడి: అవినీతికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని స్థానిక మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రీనాసాహు అన్నారు. అవినీతి నివారణ వారోత్సవాల సందర్భంగా కళాశాలలో చైతన్య సమావేశాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ అధికారిని మధుస్మితా ప్రధాన్, యువరెడ్‌క్రాస్ అధికారి క్రిష్ణచంద్ర పండిట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. దేశం, రాష్ట్రం అభ్యున్నతికి, అవినీతి రహిత పాలన అందించేందుకు ప్రతి ఒక్కరూ లంచానికి దూరంగా ఉండాలని ఎన్‌ఎస్‌ఎస్ అధికారి మధుస్మితా ప్రధాన్ పిలుపునిచ్చారు. అవినీతికి దూరంగా ఉంటామని విద్యార్థులు, అధ్యాపకులచే ప్రతిజ్ఞ చేయించారు.

ఓటమి విజయానికి తొలి మెట్టు

- జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్
- ముగిసిన జిల్లాస్థాయి క్రీడాపోటీలు



బాలురు విభాగంలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్ బహిణీపతి

జయపురం: ఓటమిని విజయానికి ప్రథమ మెట్టుగా భావించాలని జయపురం ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి అన్నారు. జయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రెండు దినాలు నిర్వహించిన కొరాపుట్ జిల్లా స్థాయి క్రీడాపోటీలు బుధవారంతో ముగిశాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బాహిణీపతి మాట్లాడుతూ.. పోటీల్లో ఎంతమంది పాల్గొన్నా ఒక్కరు మాత్రమే చాంపియన్ కావటం సహజమన్నారు. ఓటమి చెందినవారు నిరాశ చెందవద్దని హితవు పలికారు. క్రీడల్లో బాగా రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల క్రీడా మైదానాన్ని అభివృద్ధి పరిచేందుకు ఎమ్మెల్యే నిధి నుంచి రూ. ఐదు లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే పోటీలో విజేతలైన క్రీడాకారులకు జర్కిన్ షూట్‌లు సమకూర్చనున్నట్లు వెల్లడించారు.

విజేతలు వీరే..

రెండు రోజులు జరిగిన పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. 14 ఏళ్లలోపు బాలురు విభాగంలో చాంపియన్‌గా కొరాపుట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన అభినాష్ మడకామి నిలవలగా బాలికల విభాగంలో నందపూర్ ఆదర్శ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని అశ్విణీ పనసపుటియ నిలిచింది. 17 ఏళ్ల బాలుర విభాగంలో కొరాపుట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి రబిసింగ్ శాంత, విద్యార్థినుల గ్రూపులో బొరిగుమ్మ సమితి చలానగుడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన శివాణీ గౌడలు చాంపియన్‌లుగా నిలిచారు. వారిని ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి మెమెంటోలు అందజేసి అభినందించారు. విజేతలను త్వరలో జరుగున్న రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించనున్నట్లు జయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ప్రకాశ చంద్ర పట్నాయక్ వెల్లడించారు. ఈ పోటీలలో జిల్లాలలోని 14 పంచాయతీ సమితిల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. పలు పాఠశాలల క్రీడా ఉపాధ్యాయులు పోటీలను పర్యవేక్షించారు.

క్లుప్తంగా

రౌర్కెలాలో ఐదుగురు దారుణ హత్య

భువనేశ్వర్ : సుందరగడ్ జిల్లా రౌర్కెలా ప్రాంతంలో ఐదుగురు దారుణహత్యకు గురయ్యారు. వీరిలో ముగ్గురు మహిళలు, ఒక బాలుడు ఉన్నాడు. కరమ్‌డిహి ప్రాంతంలో రెండు వర్గాల మధ్య ఘర్షణతో ఈ సంఘటన తలెత్తినట్లు సమాచారం. మృతుల్లో చమ్మా భోంస్లే (45), సుభాష్ పవార్ (23), చరణ్ కుమార్ (45), కైలా కుమార్ (35)తో మరో 12 ఏళ్ల బాలుడు డానీ ఉన్నాడు. ఈ ఘటనలో ఓ మహిళ, నలుగురు పిల్లల జాడ లేదు. విషయం తెలుసుకున్న పశ్చిమ రేంజ్ డీఐజీ బ్రజేష్ రాయ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఫోరెన్సిక్ బృందం, డాగ్ స్క్వాడ్‌తో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక పోలీసు బలగాల్ని మోహరించారు. హత్య వెనక కారణాలను పోలీసులు ఆరా తీస్తున్నారు.

ఐస్‌పుల్లలతో కాళీమాత



దీపావళి సందర్భంగా ఇంజనీరింగ్ విద్యార్థి, సృజనాత్మక కళాకారుడు బిశ్వజిత్ నాయక్ అద్భుత కళాఖండం ఆవిష్కరించాడు. 375 ఐస్‌క్రీమ్ పుల్లలు వినియోగించి 18 అంగుళాల ఎత్తు, 20 అంగుళాల వెడల్పుతో వారం పాటు శ్రమించి ఈ కళాఖండాన్ని రూపొందించాడు. - భువనేశ్వర్

చేపల కూర కోసం సహోద్యోగి హత్య

భువనేశ్వర్: చేపల కూర కోసం జరిగిన వాగ్వాదం హత్యకు దారితీసింది. ఈ ఘటన డొమైణ ప్రాంతంలో ఓ హోటల్లో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వంటపుట్టితో వాగ్వాదానికి దిగిన తోటి సిబ్బంది పదునైన పరికరంతో దాడికి పాల్పడడంతో కుక్ పీతాంబర జెనా మృతి చెందాడు. మృతుడు గంజాం జిల్లా సారొడా నివాసిగా గుర్తించారు. చంద్రశేఖరపూర్ స్టేషన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

నౌపడ రైల్వేట్రాక్‌పై మృతదేహం

పర్లాకిమిడి: నౌపడ రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పద స్థితిలో ఓ మృతదేహాన్ని జి.ఆర్.పి.సి బృంది గుర్తించారు. పరిశీలన చేయగా.. మృతుడు పర్లాకిమిడి రాజవీధికి చెందిన బంగారు వ్యాపారి పొట్నూరు శంకర్ ఆచారి (54)గా గుర్తించారు. బుధవారం సాయంత్రం రైలు కింద పడటంతో తల, మొండెం వేరయ్యాయి. ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అజిత్‌సోడికి ఘన నివాళులు



అజిత్ సోడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న పోలీసులు

మల్కన్‌గిరి: జిల్లాలోని పోడియా సమితి సిమిలిబంచ్ గ్రామానికి చెందిన అజిత్ సోడి అనే పోలీసు అధికారి 2012లో మావోయిస్టుల కాల్పుల్లో మృతిచెందాడు. ఈ సందర్భంగా బుధవారం ఆయన విగ్రహానికి ఐఐసీ సుభాష్ ఛంద్రకర్కర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

నాటు తుపాకులు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నాటు తుపాకులు



నిందితుడితో పోలీసులు

భువనేశ్వర్: నయాగఢ్ జిల్లాలో నాటు తుపాకుల గుట్టు రట్టు అయ్యింది. సదరు ఠాణా మాలీ సాహి ప్రాంతంలోని ఓ కార్ఖానాపై దాడి చేసి నిందితుడు కాబూలీ మహరణను అరెస్టు చేశారు. నాటు తుపాకులు, పరికరాలు స్వాధీనం చేసుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఆదివాసీ సంఘర్ష్ మోర్చా, సీపీఐ (ఎం.ఎల్) లిబరేషన్ నాయకులు



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీపీఐ(ఎం.ఎల్) లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు తిరుపతి గోమాంగో

పర్లాకిమిడి: ప్రభుత్వ స్థలాలను పేదలకు అందజేయాలని నువాగడ సమితిలో సీపీఐ (ఎం.ఎల్) లిబరేషన్, ఆదివాసీ సంఘర్ష్ మోర్చా (ఎ.ఎస్.ఎం) ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. తొలిత మాణికేశ్వరీ మందిరం నుంచి నువాగడ బ్లాక్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. నువాగడ సమితిలో అంతరాడ గ్రామ పంచాయతీలో గువారీగాం బస్తీ, శ్మశానం స్థలాన్ని పేదలకు పంచిపెట్టాలని, తబరాడ గ్రామంలో పోరంబోకును 40 మంది ఆదివాసీలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. నువాగడలో మాణిక్‌పూర్ గ్రానైట్ లీజ్‌ను రద్దుచేయాలని, ఉపాధి పనుల్లో అవినీతికి తావులేకుండా చూడాలని, 200 పనిదినాలు కల్పించి రోజుకు రూ.600లు మంజూరు చేయాలని, బీపీఎల్ కుటుంబాలకు నెలకు 300 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా అందజేయాలని, మొక్కజొన్న రైతులకు మద్దతు ధర కిలోకు రూ.100 పెంచాలని, అటవీ భూముల చట్టం 2006 అమలు చేయాలని కోరారు. తహసీల్దార్‌కు సీపీఐ (ఎం.ఎల్) రాష్ట్ర కమిటీ సభ్యుడు తిరుపతి గోమాంగో వినతిపత్రం అందజేశారు. నర్సింహ మండళ్, సుకుమారి గోమాంగో, బృందావన్ చిపికా, మాథ్యూ రయితో, సర్వశ్రీ గోమాంగో, జేమ్స్ రయితో, కరునాకర్ లిమ్మా పాల్గొన్నారు.

దీపాలంకరణ



దీపాలు వెలిగిస్తున్న విద్యార్థులు

పర్లాకిమిడి: స్థానిక సరస్వతీ శిశు విద్యామందిర్‌లో నరకచతుర్థశి సందర్భంగా దీపావళిని విద్యార్థులు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని దేవీమఠం మహంత రామానంద దాస్ ప్రారంభించారు. ఈ వెలుగుల పండుగను అన్ని మతాలవారు నిర్వహిం వచ్చన్నారు. విద్యార్థులు బుధవారం సాయంత్రం దీపాలు వెలిగించారు. విద్యాలయం పర్యవేక్షణ కమిటీ అధ్యక్షుడు సుభాష్ జమాదార్, ఉపాధ్యక్షుడు సంజయ్ జెన్నా, కార్యదర్శి చంద్రశేఖర పట్నాయిక్ పాల్గొన్నారు.

శిక్షణ వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ భాగ్యలక్ష్మి

ఆమదాలవలస: రైతులు ఎరువుల డీలర్లుగా మారడానికి వ్యవసాయ పరపతి సంఘాల ప్రతినిధులకు అందించే శిక్షణ వినియోగించుకోవాలని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి సూచించారు. కేవీకేలో 15 రోజులుగా మేనేజ్ మరియు సమితి వారి ఆర్థిక సౌజన్యంతో వ్యవసాయ సహకార సంఘ ప్రతినిధులకు సమగ్ర పోషక యాజమాన్యంపై సర్టిఫికెట్ కోర్సు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని బుధవారంతో ముగింపు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ 15 రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రాథమిక సహకార సంఘ సభ్యులు చక్కగా వినియోగించుకోవాలని సూచించారు. రైతులకు ఎరువుల డీలర్స్‌గా మారడానికి ఈ శిక్షణా కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రసాయన ఎరువులతో పాటు సేంద్రీయ ఎరువులను కూడా వ్యవసాయంలో వినియోగిస్తే పర్యావరణం కలుషితం కాకుండా, మానవాళి ఆరోగ్యం దెబ్బతినకుండా ఉంటుందని వివరించారు. శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సమగ్ర ఎరువుల యాజమాన్యం చేయకపోయినా పంటకు నష్టం వాటిల్లే అవకాశం ఎక్కువగా ఉందని తెలుపుతూ, ఎరువులు వాడకములోని మెలకువలను వాటి తాలూకు పోషక నివారణ చర్యలను ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా తెలుసుకున్నారని వివరించారు. కార్యక్రమంలో తొగరం వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నేలవేణి, రాగోలు వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఉదయ బాబు, డాక్టర్ అనూష, డాక్టర్ బాల కృష్ణ, శ్రీకాకుళం మరియు పాడేరు ప్రాథమిక సహకార సంఘ ఉద్యోగులు పాల్గొన్నారు .

గర్భస్థ శిశువు మృతిపై విచారణ

భువనేశ్వర్: కేంద్రాపడా జిల్లా డెరాబిస్ మండల కార్యాలయంలో మహిళా ఉద్యోగి గర్భస్థ శిశువు మరణ సంఘటన తీవ్ర కలకలం రేపుతోంది. రాష్ట్ర మహిళా శిశు అభివృద్ధి శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా విచారణకు ఆదేశించారు.

పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తుల గడువు పెంపు

శ్రీకాకుళం రూరల్: స్టేట్ ఎలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్ కౌన్సిల్ సెక్రటరీ తరపున డిప్లమా పారామెడికల్ కోర్సుల కన్వీనర్ కోటా దరఖాస్తులకు గడువును నవంబర్ 3 వరకూ పొడిగించినట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు నవంబర్ 12 వరకూ అవకాశం కల్పించామని పేర్కొన్నారు. ఇంటర్మీడియెట్ ఏ గ్రూప్ ఉత్తీర్ణత సాధించినా అర్హులేనని చెప్పారు. కోర్సు పూర్తి చేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 7680945357, 7995013422 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఇంటర్‌లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

హిరమండలం: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకున్నట్లు డీవీఈవో శివ్వాల తవిటినాయుడు తెలిపారు. బుధవారం హిరమండలం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఫస్టియర్‌లో 6436 మంది, సెకెండియర్‌లో 5,939 మంది విద్యార్థులు చదువుతున్నారని చెప్పారు. పబ్లిక్ పరీక్షల మాదిరిగానే యూనిట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సెస్ బకాయిలు రూ.4 కోట్లు

సారవకోట: పంచాయతీలు, మున్సిపాల్టీల ద్వారా గ్రంథాలయాలకు రూ.4 కోట్ల సెస్ బకాయిలు రావాల్సి ఉందని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బి.కుమార్‌రాజా తెలిపారు. బుధవారం సారవకోటలోని మహాత్మాగాంధీ స్మారక శాఖా గ్రంథాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెస్ బకాయిలు పేరుకుపోవడంతో అభివృద్ధి పనులు చేయలేకపోతున్నామన్నారు.

పవిత్ర ఆధ్యాత్మిక మాసం కార్తీకం

- నేటి నుంచి కార్తీక మాసం ప్రారంభం
- నెల రోజులు ఉపవాస దీక్షల మయం
- భక్తులతో దేవాలయాల కిటకిట



శ్రీముఖలింగం ప్రధాన దేవాలయం



దేవాలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు (ఫైల్)

జలుమూరు: ఏడాదిలో హిందువులకు అత్యంత పవిత్రమైనది మాసం కార్తీక మాసం. హరి(విష్ణువు), హరుడు (శివుని)కి అతి ప్రీతిపాత్రమైన ఈ మాసంలో ఉపవాస దీక్షలు, నిష్ఠతో పూజలు, ఆలయాల దర్శనాలు చేస్తే కైలాసాన్ని చేరుకుంటారని ఎక్కువ మంది విశ్వసిస్తారు. అదేవిధంగా కార్తీక మాసంలో దేవతాస్నానం(వేకువజామున) చేస్తే యాగఫలం సిద్ధిస్తుందని శ్రీముఖలింగం ఆలయ అర్చకులు చెబుతున్నారు. కార్తీక సాన్నం, ఆలయ దర్శనం, దాన ధర్మాలు, ఉపవాస దీక్షలు, వన భోజనం, దీపారాధన తదితర కార్యక్రమాలు ఎలా నిర్వహించాలి, వాటి ఫలితం ఎలా ఉంటుందో అర్చకులు వివరించారు. ప్రధానంగా ప్రత్యేకంగా సోమవారాలు, ఏకాదశి, శనివారంతోపాటు ఇతర రోజుల్లో కూడా ఈ నెల రోజులు అన్నీ పుణ్యదినాలేనని పేర్కొన్నారు.

ఉపవాస ఫలితం

కార్తీక సోమవారం ఆచరించే వారు మరణం తర్వాత కైలాసంలో శివ సన్నిధిని చేరుకుంటారని అర్చకులు చెబుతున్నారు. ఇదే నెలలో ఏ సోమవారాన్ని ఆచరించినా వేయి అశ్వమేధాల యాగాఫలాన్ని పొందుతారన్నారు. అందువలన ఈ మాసంలో ఉపవాసం చేస్తే ఎంతో మేలు జరుగుతుందని పేర్కొంటున్నారు.

ఉపవాసం: భక్తులు కార్తీక సోమవారం పగలంతా ఉపవాస దీక్షలో ఉండి, సాయంకాలం శివుడికి అభిషేకం చేస్తారు.

తిలదానం: మంత్ర జపం తెలియని వారు, ఉపవాస దీక్షలు చేయలేని వారు నువ్వులను బ్రాహ్మణులకు దానం చేస్తే పుణ్యఫలం కలుగుతుంది.

ఏక భుక్తం: ఉపవాస దీక్షలు చేయలేనివారు, ఉదయాన్నే స్నానం చేసి, ఆలయాల దర్శనం తర్వాత మధ్యాహ్న భోజనం చేసి రాత్రికి అల్పాహారం తినవచ్చు.

స్నానం ఫలితం: కార్తీక మాసాల్లో నదుల్లో స్నానాలు చేస్తే మంచిది. అవకాశం లేని వారు కాలువలు, ఇంటి వద్ద ప్రాతఃకాల సాన్నాలు చేసి దేవాలయాలు సందర్శిస్తే ఎంతో మంచిది. కనీసం కార్తీక మాసం నెల రోజుల్లో ఒక్క రోజైనా శివుడిని, విష్ణువుని దర్శించుకుంటే మంచిది. అవకాశం లేని వారు శుక్ల, పాడ్యమి, పౌర్ణమి, అమావాస్య దినాల్లో దేవతా స్నానం(వేకువజాము) చేస్తే పుణ్యఫలం కలుగుతుంది.

దీపారాధన: కార్తీక మాసంలో ఇష్ట దైవమైన శివుడు, విష్ణువు తదితర దేవతలకు పూజలు చేయడం ఎంతో మంచిది. ఆవు నెయ్యి, నువ్వుల నూనెతో దీపారాధన చేయడం ఎంతో శ్రేష్ఠం. అలాగే దీపం కింద భాగం బ్రహ్మగా, స్తంభం విష్ణువు ప్రతిరూపంగా, ప్రమిదను శివునిగా పురాణాల్లో చెబుతారు. నదులు, జలాశయాలు, చెరువులు, కాలవల్లో దీపాలు వదలడం వల్ల పాపాలు సమిసి పోతాయి. కార్తీక మాసంలో రోజూ దీపాలు వదలడం ద్వారా శాంతి, సుఖం, సౌఖ్యం కలుగుతుందని అర్చకులు చెబుతున్నారు.

వన భోజనం: బ్రహ్మ ముహూర్తంలో ఉదయం నాలుగు గంటలకు లేచి, స్నానమాచరించి, సంధ్యోపాసన చేసి కార్తీక పురాణం పారాయణం చేయాలి. అలాగే అన్ని రకాల వృక్షాలతోపాటు ఉసిరి చెట్టు ఉన్న తోటల్లో వన భోజనం చేస్తే పాపాల నుంచి విముక్తి పొందుతారు. అలాగే కార్తీక దామోదరుడైన విష్ణుమూర్తి అనుగ్రహం పొందవచ్చు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



శిక్షణ పొందిన రైతులు

జయపురం: పౌష్టికాహార సంబంధిత తోటల పెంపకంపై ఆసక్తి ఉన్న 500 మంది రైతులకు జయపురం పూల్‌బెడలోని ఎస్.ఎస్.స్వామినాథన్ రిసెర్చ్ కేంద్రంలో బుధవారం శిక్షణ ఇచ్చారు. ఒడిశా ప్రభుత్వ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో పౌష్టికాహార సంబంధిత వ్యవసాయ ప్రణాళిక, యాజమాన్యంపై శిక్షణ ఇచ్చినట్లు ఎం.ఎస్.మినాథన్ రిసెర్చ్ జయపురం కేంద్ర డైరెక్టర్ ప్రశాంత కుమార్ పరిడ తెలిపారు. జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితి, నవరంగపూర్ జిల్లా కొశాగుమడ సమితిలోని 500 మంది రైతులు హాజరయ్యారు. పౌష్టికాహార తోటలలో మూడు రకాల కాయగూరల పంటలు, ఆకు కూరలు, దుంప జాతులు, మొదలగు పంటలు ఎలా పండించాలి, పంటల యాజమాన్యం, కాయగూరల తోటల గట్లపై వివిధ రకాల పండ్ల చెట్లు నాటి పండించటంపై వివరించారు. నర్సరీల ద్వారా ఎలా ఉత్తమ నారు పెంచాలో శిక్షణ ఇచ్చారు. ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. శిక్షణ పొందిన రైతులు తమ గ్రామాలోని రైతులకు శిక్షణ ఇవ్వాలని ప్రశాంత కుమార్ పారిడ అన్నారు. ఎం.ఎస్.స్వామినాథన్ రిసెర్చ్ కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ అక్షయ్‌కుమార్ పండ తదితరులు పాల్గొన్నారు.

ఆటబొమ్మలో నాగుపాము



బొమ్మలో చిక్కుకున్న నాగుపాము

భువనేశ్వర్: ఆటబొమ్మలో నాగుపాము బుసలు కొడుతూ భయభ్రాంతులకు గురిచేసింది. ఈ ఘటన పూరీ జిల్లా సత్యబాది గ్రామంలో చోటుచేసుకుంది. పెరటి తోటలో వింత శబ్దం రావడంతో వెళ్లిన యజమాని ప్లాస్టిక్ ఆటబొమ్మను పరిశీలించగా నాగు పాము ఉన్నట్లు గుర్తించాడు. వెంటనే స్నేక్ హెల్ప్ లైనుకు సమాచారం అందించడంతో కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అండ్ యానిమల్ హజబండ్రీ అధ్యాపకుడు డాక్టరు ఇంద్రమణి నాథ్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య బృందం శస్త్ర చికిత్స పరికరాలతో చేరుకుని పాముని విడుదల చేశారు. సుమారు 10 రోజులుగా ఆహారం లేక నీరసించిన పాము వైద్య సంరక్షణలో పూర్తిగా కోలుకున్నాక అటవీ ప్రాంతంలో విడిచిపెడతామని చెప్పారు.

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి



ప్రదీప్ మృతదేహం

మల్కన్‌గిరి: విద్యుత్ షాక్‌తో యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన మల్కన్‌గిరి జిల్లా బలిమెల ఎన్‌ఏసీలో బుధవారం చోటుచేసుకోగా.. ప్రదీప్ మీని (23) మృతి చెందాడు. కోరుకొండ సమితి చితాపరి పంచాయతీ ఎంవీ–104 గ్రామానికి చెందిన ప్రదీప్ భవన నిర్మాణ కార్మికుడుగా పని చేస్తుంటాడు. బుధవారం ఉదయం బలిమెల పోలీసుస్టేషన్‌కు 200 మీటర్ల దూరంలో స్వచ్ఛతా విభాగం సెక్షన్ కార్యాలయం భవనం పనులు చేస్తుండగా శ్లాబ్‌కు సమీపంలో ఉన్న 11 కేవీ విద్యుత్ తీగ తగలడంతో షాక్‌కు గుర్యయ్యాడు. తోటి కార్మికులు ప్రదీప్ మీనిని బలిమెల ఆరోగ్య కేంద్రానికి తీసుకొని వెళ్లగా వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని చెప్పి మల్కన్‌గిరి ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఇక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. విద్యుత్ లైన్ అనాధికారికంగా ఏర్పాటు చేసినట్టు తెలిసింది. దీనిపై సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు.

రహదారి నిబంధనలపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, పోలీసులు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో నవ యువ భరత్ తరపున రహదారి భద్రతా కర్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మల్కన్‌గిరి మహిళా కళాశాల అధ్యక్షుడు దుశ్మంత్ కుమార్ జేనా అధ్యక్షతన డీఎన్‌కే ట్రాఫిక్ కూడలి వద్ద కళాశాల విద్యార్థులతో హెల్మెట్ వినియోగం, రహదారి నిబంధనలపై అవగాహన కల్పించారు. మద్యం తాగి, ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. పోలీసులు, నెహ్రూ యువ కేంద్రం సభ్యుడు సంతోష్ కుమార్ పాత్రో తదితరులు పాల్గొరు

ఓటరు ముసాయిదా జాబితా విడుదల



ఓటరు జాబితాను విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు

మల్కన్‌గిరి: కలెక్టరేట్‌లోని ఎఫ్‌ఎల్‌సీ హాల్‌లో ఓటరు ముసాయిదా జాబితాను కలెక్టర్ ఆశీష్ పటేల్, 147 నియోజకవర్గాల రిజిస్ట్రేషన్ అధికారి వేద్బర్ ప్రధన్, సబ్ కలెక్టర్ దుర్యోధన్ బోయి బుధవారం విడుదల చేశారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 4 లక్షల 56 వేల 229 మంది ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. వీరిలో పురుషులు 2 లక్షల 21 వేల 57 మంది, స్త్రీలు 2 లక్షల 37 వేల 127 మంది, ఇతర వర్గాలకు చెందినవారు 45 మంది ఉన్నారన్నారు. నవంబర్ 2, 10, 16, 24వ తేదీల్లో ప్రత్యేక ప్రచార కర్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 2025లో జరగనున్న పంచాయతీ ఎన్నికలు నాటికి అన్ని పార్టీలు బీఎస్‌ఓలను నియమించాన్నారు ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, డీఐపీఆర్‌ఓ ప్రమిళ మాఝి పాల్గొన్నారు.

అమరవీరులు కోరన్న, మంగన్నల 57వ వర్ధంతి సభ నేడు

కాశీబుగ్గ: శ్రీకాకుళ గిరిజన రైతాంగ సాయుధ పోరాటంలో రక్తతర్పణ చేసిన తొలి ఆదివాసీ అమరవీరులు ఆరిక కోరన్న, కొండగొర్రి మంగన్నల 57వ వర్ధంతి సభను మందస మండలం కొండలోగాం ఆదివాసీ గ్రామంలోని అమరజీవి సవర చిలకమ్మ స్థూపం వద్ద గురువారం నిర్వహిస్తున్నట్లు సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమొక్రసీ జిల్లా కమిటీ కార్యదర్శి తాండ్ర ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఆరోజు ఉదయం 9 గంటలకు జరగబోయే ఈ స్మారక సభలో పలు ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని పేర్కొన్నారు. ఆదివాసీ ప్రజలు, ఇతర ప్రజా సమూహాలు పాల్గొనే ఈ సభను విజయవంతం చేయాలని కోరారు.

రాష్ట్రపతి భవన్‌లో కోణార్క్ చక్రాలు



అమృత ఉద్యానంలో కోణార్కు చక్రం



రాష్ట్రపతి భవన్‌లో కోణార్కు చక్రం

భువనేశ్వర్: రాష్ట్రపతి భవనం కోణార్క్ చక్రాలతో కొత్త శోభను సంతరించుకుంది. ప్రెసిడెంట్ ద్రౌపది ముర్ము చొరవతో నాలుగు కోణార్కు చక్రాల శిల్పాల్ని ఏర్పాటు చేశారు. వీటిని రాష్ట్రపతి భవన్ ఆవరణ, అమృత ఉద్యానం ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. భారత దేశపు ఘన వారసత్వం, సంప్రదాయం, సంస్కృతి, చారిత్రాత్మక ప్రాధాన్యం పరిచయం చేసేందుకు వీటిని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

రన్ ఫర్ యూనిటీ


యూనిటీ ఫర్ రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఏఆర్ అదనపు ఎస్పీ నాగేశ్వరరావు

విజయనగరం క్రైమ్: జాతీయ సమైక్యత దినం పురస్కరించుకుని జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో యూనిటీ ఫర్ రన్ కార్యక్రమాన్ని ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలలేసి, పుష్పాలు సమర్పించి, ఘనంగా నివాళులర్పించారు. పటేల్‌ను స్ఫూర్తిగా తీసుకుని జాతీయ సమగ్రత, భద్రత, సమైక్యతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జాతీయ సమైక్యత పరుగులో విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, సీఐలు పాల్గొన్నారు.

జనావాసాల మధ్య మద్యం దుకాణంపై ఆందోళన


కుమిలిలో మద్యం షాపు తరలించాలని ధర్నా చేస్తున్న మహిళలు

పూసపాటిరేగ : కుమిలి గ్రామంలో జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని వేరే చోటకు తరలించాలని మహిళలు షాపు ఎదుట బుధవారం రాత్రి ధర్నా చేశారు. షాపు గ్రామం మధ్యలో వుండటంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు అటుగానే వెళ్తున్నందున ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే దీన్ని ఇక్కడ నుంచి వేరే చోటకు తరలించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో ముత్యాలురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 15 మేక పిల్లల మృతి


కుక్కల దాడిలో మృతి చెందిన మేక పిల్లల వద్ద రోదిస్తున్న యజమాని

బొండపల్లి: మండల కేంద్రంలోని గొల్లలపేట గ్రామానికి చెందిన బొట్టా చంద్రయ్యకు చెందిన 15 మేక పిల్లలు కుక్కల దాడిలో బుధవారం మృతి చెందాయి. వివరాల్లోకి వెళ్తే.. చంద్రయ్యకు చెందిన మేక పిల్లలతో పాటు గొర్రె పిల్లలు ఇంటి వద్ద ఉండగా కుక్కలు ఒక్కసారిగా వాటిపై దాడి చేశాయి. దీంతో మేక పిల్లలు తీవ్రంగా గాయపడి మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.లక్షన్నర ఉంటుందని యజమాని గొల్లుమన్నాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు జిల్లా విద్యార్థులు


రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థినిలను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఇతర సిబ్బంది

గజపతినగరం: మండలంలోని మరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్ 14, 17 ఖోఖో క్రీడా పోటీల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లాల నుంచి సుమారు 500 మంది విద్యార్థులు పోటీ పడ్డారు. వీరిలో అండర్ 14 బాలికల విభాగం నుంచి 24 మంది, అండర్ 17 బాలుర విభాగం నుంచి 24 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం వి.నాగమణి బుధవారం తెలిపారు. అండర్ 17లో ఎంపికైన వారంతా అనకాపల్లి జిల్లా తుంపాలలో నవంబరు 2, 3 తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరపున పాల్గొంటారని తెలిపారు. అండర్ 14 విభాగంలో ఎంపికైన వారంతా పల్నాడులో నవంబరు 7, 8, 9 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వీరిని సర్పంచ్ లెంక రామలక్ష్మి, పాఠశాల సిబ్బంది, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

'అత్యవసర' ఉద్యోగుల ఆందోళన

- వేతనాలందక అవస్థలు
- నల్లబ్యాడ్జీలతో నిరసన
- జిల్లాలో 17 వాహనాల్లో 87 మంది ఉద్యోగులు


పట్టణంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న 108 ఉద్యోగులు

పార్వతీపురం టౌన్: ఏఈఎంఎస్ సంస్థ నిర్వహణ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి 108 ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందక అవస్థలు పడుతున్నారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. జీతాలు నెలలుగా అందకపోవడంతో ఇంటి అద్దె నుంచి ఈఎంఐల చెల్లింపుల వరకు ప్రతిచోటా అవమానాలకు గురవుతున్నారు. ఇదే విషయమై సంస్థ ప్రతినిధులను ప్రశ్నిస్తే ప్రభుత్వం తమకు ఏప్రిల్ నుంచి చెల్లింపులు చేయకున్నా.. తాము జూలై నెల వరకు జీతాలు చెల్లించామని, ఇప్పుడు ప్రభుత్వం బకాయిలు చెల్లిస్తే తప్ప తాము జీతాలు చెల్లించలేమని సంస్థ ప్రతినిధులు కుండ బద్దలు కొట్టడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 17 వాహనాలకు సంబంధించి 87 మంది ఉద్యోగులకు సమయానికి వేతనాలు అందక ఆవేదన చెందుతున్నారు. ఈ మేరకు నవంబరు 8 వరకు షరతులతో కూడిన నిరసనలు తెలియజేస్తున్నారు. అప్పటికీ స్పందించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరిస్తున్నారు.

ఈఎంటీ పోస్టులలో నియమించాలి..

ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) ద్వారా అన్ని మెడికల్ కాలేజీలలో చేపడుతున్న ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటీ) పోస్టులకు నిర్ధారించిన విద్యార్హత కలిగిన అభ్యర్థులు లేనందున భర్తీ కాని పరిస్థితి నెలకొంది. కావున ఆ విద్యార్హతలు సడలించి 108 సర్వీస్‌లో ఇప్పటికే ఈఎంటీలుగా పని చేస్తున్న వారి సర్వీస్‌లను పరిగణనలోనికి తీసుకొని వైద్య ఆరోగ్య శాఖలోని డీఎంఈ ద్వారా మెడికల్ కాలేజీలలో చేపడుతున్న ఈఎంటీ పోస్టులలో నియమించాలని ఉద్యోగులు కోరుతున్నారు. 108 వ్యవస్థలో నిర్వహణ సంస్థలను మార్పు చేసే ప్రతిసారి ఈఎంటీ, పైలెట్‌లు గ్రాట్యుటీ ఎర్న్‌డ్ లీవ్స్ అమౌంట్, వార్షిక ఇంక్రిమెంట్‌లు వంటి వాటిని చెల్లించకుండానే సంస్థలు వైదొలగటంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం 108 సర్వీస్‌లో ఉద్యోగులను (ఈఎంటీ,పోలిట్) వైద్య ఆరోగ్యశాఖ లోని ఉద్యోగులుగా గుర్తించాలని వారు కోరుతున్నారు.

పని ఒత్తిడి తగ్గించాలి

వైద్య ఆరోగ్య శాఖలోని ఏ శాఖలో కూడా లేని విధంగా 108 సర్వీస్‌లో రోజుకు రెండు షిఫ్టులలో షిఫ్టుకు 12గంటల చొప్పున తీవ్ర పని ఒత్తిడితో పని చేయడం కారణంగా చాలా మంది ఉద్యోగులు అనారోగ్యం బారిన పడుతున్నారు. పని ఒత్తిడిని తగ్గించేందుకు వైద్య ఆరోగ్య శాఖలోని అన్ని శాఖలలో అమలవుతున్న విధంగా 108 వ్యవస్థలో కూడా రోజుకు 3 షిఫ్టులలో షిఫ్టుకు 8గంటల చొప్పున పని విధానాన్ని అమలు పరచాలని కోరుతున్నారు.

మరమ్మతులు సమయానికి చేపట్టాలి

రాష్ట్ర వ్యాప్తంగా 108లో ఉన్న చాలా వాహనాల మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో సమయానికి రోగులకు సేవలు అందించడంలో కొంత జాప్యం చోటుచేసుకుంటుంది. వాహనాలను సకాలంలో మరమ్మతులు చేపట్టకపోవడంతో పైలట్‌లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి జిల్లాలో వాహన మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టి 108 వాహనాలను కండిషన్‌లో ఉంచాలని ఉద్యోగులు కోరుతున్నారు.

వేతన స్లాబ్స్ విధానం రద్దు చేయాలి



108 సర్వీస్‌లోకి ఏఈఎంఎస్ సంస్థ ప్రవేశించడంతోనే ప్రవేశపెట్టిన వేతన స్లాబ్స్ విధానం కారణంగా కొద్ది మంది ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారు. గతంలో ఏఈఎంఎస్ సంస్థ ఇచ్చిన హామీ మేరకు వేతన స్లాబ్‌లను అప్‌గ్రేడ్ చేయాలి. ఉద్యోగులకు ఆర్థిక భరోసా కల్పించాలి.

– ఆవాల శ్రీనివాస్, 108 ఎంప్లాయిస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు

ప్రతి ఉద్యోగికి చెల్లింపులు చేయాలి



ఉద్యోగులకు రావాల్సిన వార్షిక ఇంక్రిమెంట్ బకాయిలు, జీతాల బకాయిలు, ఎర్న్ లీవ్‌లకు సంబంధించిన అమౌంట్ వంటి పలు అంశాలకు సంబంధించి ప్రతి ఉద్యోగికి చెల్లింపులు చేయాల్సి ఉంది. వీటి విషయంలో ఉద్యోగుల ఆందోళనను పోగొట్టే విధంగా ప్రభుత్వ అధికారులు, యాజమాన్యం స్పష్టతను ఇచ్చి భరోసా ఇవ్వాలి.

– పతివాడ శ్రీను, పైలెట్

బకాయి బిల్లులు వెంటనే చెల్లించాలి



రిలీవింగ్ బిల్లులు, ఎలక్ట్రికల్ బిల్లులు, వాహన మైనర్ మరమ్మతులు బిల్లులు వంటి ఉద్యోగులకు చెల్లించ వలసిన వాటిని వెంటనే చెల్లించాలి. ఈ సమస్యలపై యాజమాన్యం, ప్రభుత్వ అధికారుల దృష్టికి కూడా పలుమార్లు మెమొరాండం రూపంలో తీసుకువెళ్లాం. ఇప్పటి వరకు సరైన స్పందన లేదు. సమస్యలు పరిష్కారం కాక ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు.

– గొర్లి అప్పలనాయుడు, జిల్లా అధ్యక్షుడు, 108 ఎంప్లాయిస్ యూనియన్

పరిపూర్ణ మహిళ అమ్మడమ్మ

- మాజీ మంత్రి బొత్స, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు


అమ్మడమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి బొత్స తదితరులు


అమ్మడమ్మ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

బొబ్బిలి: వసుదైక కుటుంబాన్ని తీర్చిదిద్దిన పరిపూర్ణ మహిళగా శంబంగి అమ్మడమ్మ భవిష్యత్ కుటుంబ వ్యవస్థలోనూ నిలిచిపోతారని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు సోదరుడు శ్రీరాములునాయుడి సతీమణి, విశాఖ డెయిరీ సీనియర్ డైరెక్టర్ అమ్మడమ్మ సంస్మరణ కార్యక్రమం బుధవారం మండలంలోని పక్కిలో జరిగింది. కార్యక్రమానికి రాష్ట్రంలోని పలు రాజకీయ, వ్యాపార కుటుంబాలకు చెందిన ప్రముఖులు హాజరై అమ్మడమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అమ్మడమ్మ అడుగుజాడల్లో నడవాలి : జడ్పీ చైర్మన్

ఉమ్మడి కుటుంబ వ్యవస్థను ద్విగ్విజయంగా నడిపించిన శంబంగి అమ్మడమ్మ అడుగుజాడల్లో నేటి కుటుంబ వ్యవస్థ, కుటుంబాల్లోని సభ్యులు నడవాలని జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పక్కిలో జరిగిన సంస్మరణ కార్యక్రమానికి ఆయన హాజరై అమ్మడమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. అమ్మడమ్మ సంస్మరణ కార్యక్రమానికి హాజరైన వారిలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన, మాజీ ఎమ్మెల్యేలు బొత్స అప్పలనర్సయ్య, అలజంగి జోగారావు, తలే వీరభద్రయ్య, బొబ్బిలి చిరంజీవులు, మాజీ డీసీసీబీ చైర్మన్ వేచలపు చినరామినాయుడు, వైఎస్సార్ సీపీ అరకు పార్లమెంటు అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, విశాఖ డెయిరీ చైర్మన్ అడారు ఆనంద కుమార్, డైరెక్టర్లు, సిబ్బంది, బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, పార్వతీపురం టీడీపీ నాయకులు ద్వారపురెడ్డి జగదీష్, బొబ్బిలి మున్సిపల్ కౌన్సిలర్లు, నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఉత్తరాంధ్రలోని వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొని అమ్మడమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అమరుల త్యాగ ఫలితమే ప్రశాంత జీవనం

- సంస్మరణ వారోత్సవాల్లో కొవ్వొత్తుల ర్యాలీ
- ఎస్పీ ఎస్వీ మాధవ్‌రెడ్డి


కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం టౌన్: అమర వీరులు చేసిన త్యాగాల ఫలితమే ప్రస్తుత ప్రశాంత జీవనమని ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా బుధవారం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆఫీస్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అమరవీరులు చేసిన ప్రాణ త్యాగాలను స్మరించుకుంటూ ఈ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించడం జరిగిందని తెలియజేశారు. అమర వీరులు చేసిన త్యాగాల ఫలితంగానే మనం ఇంత ప్రశాంతంగా జీవనం సాగిస్తున్నామన్నారు. ఆర్టీసీ కూడలి వద్ద విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అశువులు బాసిన త్యాగమూర్తుల చిత్రపటాల వద్ద కొవ్వొత్తులను ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ అధికారులు, సిబ్బంది, కళాశాల విద్యార్థులు, ప్రజలకు ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ డా.ఓ.దిలీప్‌కిరణ్, జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ఎస్వీ వెంకట అప్పారావు, పార్వతీపురం టౌన్ ఇన్‌స్పెక్టర్ నారాయణరావు, పార్వతీపురం రూరల్ ఇన్‌స్పెక్టర్ గోవిందరావు, జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శ్రీరాములు, నాయుడు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, కళాశాల విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

మ్యాన్ పవర్ టెండర్ రద్దు చేయాలి

- ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ కమిటీ డిమాండ్


మాట్లాడుతున్న సంఘం జోనల్ కమిటీ నాయకులు

విజయనగరం అర్బన్: ఆర్టీసీ విజయనగరం జోనల్ వర్క్ షాప్ మేనేజర్ ఇటీవల ఏకపక్షంగా నోటిఫికేషన్ ఇచ్చిన మ్యాన్ పవర్ టెండర్ షెడ్యూల్‌ను రద్దు చేయాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ కమిటీ డిమాండ్ చేసింది. స్థానిక జోనల్ కమిటీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు పలువురు డిమాండ్ చేశారు. విజయనగరం జోనల్ వర్క్ షాప్‌లో కొన్ని క్యాటగిరీల పోస్టులకు సంబంధించి అవుట్ సోర్సింగ్ నియామకం మ్యాన్ పవర్ టెండర్ షెడ్యూలు వల్ల ప్రస్తుతం సంస్థల పని చేస్తున్న అనేక మంది పదోన్నత అవకాశాలు కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే వివిధ సమస్యలతో ఆర్టీసీ ఉద్యోగులు సతమతమవుతున్నారని ఈ టెండర్ నోటిఫికేషన్ వల్ల కార్మికులకు మరిన్ని సమస్యలు వస్తాయని పేర్కొన్నారు. ఈ టెండర్ నోటిఫికేషన్ వల్ల కార్మికుల్లో మరింత ఆందోళన కలిగించినట్లు అవుతారని అన్నారు. దీన్ని ఎంప్లాయిస్ యూనియన్ వ్యతిరేకిస్తుందని ఇప్పటికే జోనల్ మేనేజర్, వర్క్ షాప్ మేనేజర్‌కి యూనియన్ జోనల్ కమిటీ, వర్క్ షాప్ కమిటీ అభ్యంతరం తెలియజేశామని తెలిపారు. అనంతరం జోన్ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జోన్ ఈడీకి వినతిపత్రం అందజేశారు. నవంబరు ఆరో తేదీ విజయవాడలో జరిగే రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులకు తెలియజేసి, భవిష్యత్తు కార్యక్రమాలు చేపట్టడతామని తెలిపారు. సమావేశంలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు పి.భానుమూర్తి, సిహెచ్.వెంకటరావు, జోనల్ నాయకులు కేజే సుధాకర్, అధ్యక్షుడు బీకే మూర్తి, కార్యదర్శి జి.తాతాలు, జోనల్ వర్క్ షాప్ రీజనల్ ప్రెసిడెంట్ కేపీ రాజు, సెక్రెటరీ యు.ఎర్రంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన విద్యార్థులు


నగర పాలక సంస్థ రోడ్డులో విద్యార్థి సంఘ నాయకుడిని అరెస్టు చేస్తున్న పోలీసులు


తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించిన విద్యార్థులు

విజయనగరం రూరల్: విద్యా సంవత్సరం ఆరంభమై ఆరునెలలు కావస్తున్నా కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యల పరిష్కారంలో టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంపై విద్యార్థులు మండిపడ్డారు. సమస్యలు పరిష్కరించాలంటూ నిరసన గళం వినిపించారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రాము మాట్లాడుతూ నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చిన్నపాటి వర్షానికే బీపీఎం పాఠశాల మైదానం చెరువును తలపిస్తోందన్నారు. కంటోన్మెంట్, కస్పా, వీటీ అగ్రహారం, దాసన్నపేట, రింగ్ రోడ్డు ప్రాంతాల్లోని పలు పాఠశాలల్లో మరుగుదొడ్లకు తాళాలు వేయడం తగదన్నారు. కొన్ని పాఠశాలల్లో మెనూ గోడలకే పరిమితమవుతోందన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నాయకుల అరెస్టు

శాంతియుతంగా విద్యార్థులు చేపట్టిన నిరసన ప్రదర్శనపై పోలీసులు జులుం ప్రదర్శించడాన్ని విద్యార్థి సంఘాల నాయకులు తప్పుబట్టారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డి.రాము, జె.రవికుమార్, పట్టణ నాయకులు గుణ, వాసును ఒకటో పట్టణ పోలీసులు బలవంతంగా అరెస్టు చేయడంపై నిరసన తెలిపారు.

6న చలో కలెక్టరేట్

వచ్చేనెల 6వ తేదీన జిల్లా అంతటా ఉన్న విద్యాలయాల్లో సమస్యల పరిష్కారం కోసం నిర్వహించనున్న చలో కలెక్టరేట్‌ను విద్యార్థులు విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు భారతి, రాహుల్, ఎర్రమ్మ, మురళీ, శిరీష, చిరు, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వివాహిత మృతి


శ్రావణి (ఫైల్)

శృంగవరపుకోట : వివాహమైన ఏడాదికే ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడడం పలు అనుమానాలకు తావిస్తోంది. సన్యాసయ్యపాలెం గ్రామంలో వివాహిత ఉరి వేసుకొని బుధవారం ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని సన్యాసయ్యపాలెం గ్రామానికి చెందిన శ్రావణి(22)కి ఏడాది కిందట రాజీపేట గ్రామానికి చెందిన దొడ్డ కిశోర్‌తో వివాహం జరిగింది. పెళ్లైన తొలినాళ్లలో వీరి కాపురం సాఫీగానే సాగింది. తరువాత కొంత కాలంగా శ్రావణి తన పుట్టింట్లోనే ఉంటూ స్థానికంగా ఉన్న ప్రైవేటు పాఠశాలలో పని చేస్తోంది. బుధవారం తాను స్కూల్‌కు వెళ్లాలని క్యారేజి కావాలని చెప్పడంతో క్యారేజి సిద్ధం చేసిన తల్లి లక్ష్మి తన భర్త జగన్నాథంతో కలిసి పొలం పనులకు వెళ్లిపోయింది. తల్లిదండ్రులు పొలానికి వెళ్లాక శ్రావణి ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకొంది. ఆమెకు సమీపంతో తాను వాడే సెల్‌ఫోన్ ఉందని, అయినా డేటా మొత్తం చెరిపేసి ఉంటుందని తెలుస్తోంది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్.కోట ఎస్‌ఐ గంగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెదపెంకిలో బోద వ్యాధి ర్యాండమ్ సర్వే



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: బలిజిపేట మండలం పెదపెంకి గ్రామంలో నవంబర్ 4, 5, 6 తేదీలలో బోదవ్యాధి ర్యాండమ్ సర్వేను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం వైద్య ఆరోగ్య శాఖ ప్రగతిపై ఆయన సమీక్షించారు. పెదపెంకి పంచాయతీ పరిధిలో సుమారు 4.80 కిలోమీటర్ల మేర మురుగు కాలువ నిర్మాణానికి రూ.3.75 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. నెలలో కనీసం 70 గ్రామ సచివాలయాల పరిధిలో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. భామిని, బత్తిలి పీహెచ్‌సీల పరిధిలో టీబీ తనిఖీలు మెరుగుపడాలన్నారు. గ్రామ స్థాయిలో రక్తహీనత నివారణకు కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. వసతిగృహాలలో రక్తహీనత గమనిస్తే సంబంధిత అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలన్నారు. జిల్లాకు కొత్త అంబులెన్స్‌లు రానున్నాయన్నారు.

కేన్సర్ స్క్రీనింగ్

ఏఎన్‌ఎం,ఎంఎల్‌పీహెచ్ ఇద్దరూ ఇంటింటి సర్వేను చేపట్టి కేన్సర్ కేసులను గుర్తించాలన్నారు. సర్వైకల్ కేన్సర్, ఓరల్ కేన్సర్‌లను గూర్చి వివరించడంతో పాటు ఇతర వ్యాధుల పట్ల కూడా అవగాహన కల్పించాలన్నారు.

కృత్రిమ పరికరాలకు స్క్రీనింగ్

నవంబర్ 19 నుంచి అలిమ్ కోసంస్థ కృత్రిమ పరికరాల కోసం స్క్రీనింగ్ చేపట్టనున్నట్లు తెలిపారు. నవంబర్ 19న సాలూరులో, 21న పాలకొండ, 23న పార్వతీపురంలోను స్క్రీనింగ్ శిబిరాలను నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా బాల్యవివాహల నివారణపై నీడ్ సంస్థ రూపొందించిన పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ కె.విజయపార్వతి, ఆస్పత్రుల సమన్వయ అధికారి వాగ్దేవి తదితరులు పాల్గొన్నారు.

పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తుల గడువు పెంపు

శ్రీకాకుళం రూరల్: స్టేట్ ఎలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్ కౌన్సిల్ సెక్రటరీ తరపున డిప్లమా పారామెడికల్ కోర్సుల కన్వీనర్ కోటా దరఖాస్తులకు గడువును నవంబర్ 3 వరకూ పొడిగించినట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు నవంబర్ 12 వరకూ అవకాశం కల్పించామని పేర్కొన్నారు. ఇంటర్మీడియెట్ ఏ గ్రూప్ ఉత్తీర్ణత సాధించినా అర్హులేనని చెప్పారు. కోర్సు పూర్తి చేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 7680945357, 7995013422 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మద్యం సీసాల సీజ్

గజపతినగరం: మండలంలోని సాలిపేట గ్రామం జంక్షన్ వద్ద ద్విచక్రవాహనంపై అక్రమంగా తరలిస్తున్న 200మద్యం సీసాలను పట్టుకొని సీజ్ చేసినట్టు ఎస్‌ఐ కె.లక్ష్మణరావు బుధవారం తెలిపారు. మెంటాడ నుంచి సాలిపేట జంక్షన్ మీదుగా గెద్ద కాశీ విశ్వనాధం, ఆదిరెడ్డి సత్యనారాయణ ద్విచక్ర వాహనం ద్వారా అక్రమంగా మద్యం సీసాలను తరలించడంతో మద్యం సీసాలతో పాటు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసును నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

• పైడితల్లి సేవలో దీక్షధారులు


చదురుగుడి నుంచి వనంగుడి వరకు అమ్మవారి రథం ముందు ఇరుముడులతో సాగుతున్న దీక్షధారులు, (ఇన్‌సెట్లో)చదురుగుడిలో ప్రత్యేక అలంకరణలో పైడితల్లి అమ్మవారు

పైడితల్లి సేవలో దీక్షధారులు తరించారు. రోజంతా జై పైడిమాంబ... జైజై పైడిమాంబ నామ స్మరణలో తరించారు. ముందుగా చదురుగుడిలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక రథంపై ఉంచి దీక్షధారుల ర్యాలీని ఆలయ ఈవో డీవీవీ ప్రసాదరావు, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు ప్రారంభించారు. మేళతాళాలు, భక్తుల భజనలు, సాంస్కృతిక ప్రదర్శనలు, మాలధారుల జైపైడిమాంబ నామస్మరణ నడుమ అమ్మవారి రథయాత్ర వేడుకగా సాగింది. కోట, రంజనీథియేటర్, తోమాల మందిరం, గంటస్తంభం, కన్యకపరమేశ్వరి ఆలయం, ఎన్‌సీఎస్ రోడ్డు, గాడీఖానా మీదుగా సాగిన రథయాత్ర ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లింది. వనంగుడిలో చండీయాగం, పూర్ణాహుతి, సూర్యనమస్కారాలు, శక్తిపూజలు, అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పంచామృతాలతో అభిషేకాలు శాస్త్రోక్తంగా జరిపారు. దీక్షాపరులు ఇరుముడులను గురుస్వాములు విప్పి దీక్షలు విరమింపజేశారు. ఆరు నెలల పాటు అమ్మవారు వనంగుడిలో భక్తులకు దర్శనమిస్తారని ఈఓ తెలిపారు.

– విజయనగరం టౌన్

కిడ్నాప్ కలకలం

- నలుగురు నిందితుల అరెస్ట్
- పరారీలో మరో ముగ్గురు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ వకుల్‌జిందాల్

శృంగవరపుకోట: ఎస్.కోట మండలంలో ఓ వ్యక్తిని కిడ్నాప్‌చేసిన ఘటన కలకలం సృష్టించింది. ఎస్.కోట పోలీసుల అప్రమత్తతో బాధి తుడు క్షేమంగా బయటపడ్డారు. ఎస్.కోట పోలీస్ స్టేషన్‌లో బుధవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వకుల్ జిందాల్ ఘటన వివరాలను వెల్లడించారు. సోమవారం ఉదయం 5.30 గంట ల సమయంలో కొట్టాం గ్రామానికి చెందిన దంతులూరి సూర్యనారాయణరాజును ఇద్దరు వ్యక్తులు వచ్చి తాము పోలీసులమని, విచారణ కోసం రావాల్సి ఉందని చెప్పి తీసుకెళ్లా రు. తర్వాత ఆయన కుటుంబీకులకు ఫోన్‌చేసి రూ.4లక్షలు ఇవ్వాలని, లేకుంటే సూర్యనారాయణరాజును చంపేస్తామని బెదిరించారు. దీనిపై సూర్యనారాయణరాజు అల్లుడు కె.శివప్రసాద్ మంగళవారం రాత్రి ఎస్.కోట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బుధవారం ఉద యం 5 గంటల సమయంలో ఎస్.కోట ఎస్‌ఐ ఎస్.భాస్కరరావు ఉసిరి గ్రామం వద్ద చేపట్టిన వాహన తనిఖీల్లో ఎస్.కోట వైపు వస్తున్న ఏపీ39ఎల్ఎస్4549, ఏపీ39సివి3522 నంబర్ల గల కార్లును ఆపారు. పోలీసులను చూసి అందులో ఉన్న వ్యక్తులు పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని వెంబడించి పట్టుకు ని విచారణ జరపడంతో కిడ్నాప్ విషయం వెలుగుచూసింది. బాధితుడి జాడ తెలుసుకు ని రక్షించి కుటుంబీకులకు అప్పగించారు. కిడ్నాప్ కేసులో ఏడుగురు నిందితులు ఉన్నా రు. వీరిలో ఎ1 అయిన కసిరెడ్డి రాజు విశాఖపట్నం కొమ్మాది ప్రాంతంలోని అమరావతి కాలనీకి చెందినవాడు. ఇతనికి బాధితుడితో 20 ఏళ్లుగా పరిచయం ఉంది. ఆర్థిక అవసరాలతో కసిరెడ్డి రాజు తన ఇద్దరు కొడుకులు ప్రవీణ్‌కుమార్, సాయితో పాటు వారి స్నేహితులు మరో నలుగురి సాయంతో కిడ్నాప్‌కు పథకం రచించారు. ప్రస్తుతం పోలీసులు నలుగురుని అదుపులోకి తీసుకున్నారు. పరారైన ముగ్గురి కోసం గాలిస్తున్నారు. కేసును ఛేదించిన ఎస్.కోట పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఎస్పీతో పాటు డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ ఎస్.వి.నారాయణమూర్తి, ఎస్‌ఐ భాస్కరరావు పాల్గొన్నారు.